


నిందితులను జైలుకు తరలిస్తుండగా బయటి నుంచి రోదనలు

జంట హత్యల కేసులో 11 మందికి జీవిత ఖైదు

- చెరుకులపాడు నారాయణ రెడ్డి హత్యకేసు..
- నిర్దోషులుగా ఐదుగురు
- రోదనలతో మిన్నంటిన కోర్టు ఆవరణం
- హత్య జరిగిన 8 ఏళ్లకు శిక్ష ఖరారు
- కర్నూలు జిల్లా కోర్టు సంచలన తీర్పు



బిడ్డను చూస్తూ కన్నీటి పర్యంతమవుతున్న నిందితుడి కుటుంబ సభ్యులు




చెరుకులపాడు నారాయణరెడ్డి (ఫైల్)

వైసీపీ నాయకుడు, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భర్త చెరుకులపాడు నారాయణ రెడ్డి హత్య కేసులో కర్నూలు జిల్లా కోర్టు గురువారం సంచలన తీర్పునిచ్చింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న 11 మందికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా న్యాయాధికారి కబర్ది సంచలన తీర్పు వెల్లడించారు. కృష్ణగిరి మండలంలో వైసీపీ నేత చెరుకులపాడు నారాయణ రెడ్డి, ఆయన అనుచరుడు బోయ సాంబశివుడు ఎనిమిదేళ్ల క్రితం 2017 మే 21వ తేదీన హత్యకు గురయ్యారు. ఈ జంట హత్య కేసులో మొత్తం 19 మంది నిందితులు కాగా వారిలో 29 మంది సాక్షులను విచారించిన కోర్టు... ఐదుగురిని నిర్ధోషులుగా ప్రకటించింది. ఇదే కేసులో గతంలో ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పేర్లను గతంలోనే న్యాయస్థానం ఆదేశాల మేరకు చార్జిషీట్ నుంచి తొలగించారు. ఏ4గా ఉన్న కోతుల రామాంజనేయులు కేసు విచారణ దశలో మృతి చెందాడు. మిగిలిన 11 మందికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. తీర్పు నేపథ్యంలో నిందితుల బంధువులు, చెరుకులపాడు గ్రామస్థులు వందలాదిగా జిల్లా కోర్టు వద్దకు చేరుకున్నారు. జీవిత ఖైదు శిక్ష పడిందని తెలియడంతో ఒక్కసారిగా కోర్టు ఆవరణం నిందితుల బంధువులు, కుటుంబీకుల రోదనలతో మార్మోగింది. జీవిత ఖైదు పడిన వారిని పోలీసులు వాహనంలోకి ఎక్కిస్తుండగా.. ఒక్కసారిగా వారి భార్యపిల్లలు వారిని చూసి ఆక్రందనలు చేస్తూ పోలీసు వాహనానికి ఎదురొచ్చారు. దీంతో ఎస్కార్ట్ పోలీసులు చొరవ చూపి వాహనం వెళ్లేందుకు చర్యలు తీసుకోవడంతో నిందితులను పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.

- కర్నూలు లీగల్ (ఆంధ్రజ్యోతి)







ఓరి భగవంతుడా... (కుమారుడితో రోదిస్తున్న నిందితుడి కుటుంబ సభ్యులు)



అయ్యో.. దేవుడా..! (నిందితుడి తండ్రి ఆవేదన)

ఎట్ల స్వామీ బతికేది... (నిందితుడి భార్య రోదన)

వివరాలు 7లో

కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తులు

కర్నూలు కలెక్టరేట్, మే 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైనవారు కొత్త రేషన్‌కార్డులకు గ్రామ వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌వో రాజా రఘువీర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుతోపాటు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని సూచించారు. కొత్త బియ్యం కార్డులు, బియ్యం కార్డులో కొత్త సభ్యుల పేర్లు చేర్చుట, స్ప్లిట్ (సభ్యుల పేర్లు విడదీయుట), కొత్త కార్డు మంజూరు, బియ్యంకార్డులో సభ్యుల పేర్లు తొలగించుట, బియ్యం కార్డును సరెండర్ చేయుట అనగా బియ్యం కార్డును ప్రభుత్వానికి అప్పగించుట, చిరునామా మార్పులు చేసుకొనుట వంటి వాటికి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

బీఈడీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షల ఫలితాలను పరీక్షలు విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. రెగ్యులర్ విభాగంలో 3389 మందికి 3276, సప్లమెంటరీకి 274 మంది పరీక్షలు రాయగా 239 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సిల్వర్ సెట్‌కు 15 వరకు గడువు

కర్నూలు అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రవేశాల కోసం నిర్వహించే సిల్వర్ సెట్ 2025కు దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిల్వర్ సెట్ గురించి చాలామంది విద్యార్థులకు తెలియాలనే ఉద్దేశంతో గడువు పెంచామని, ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలోని చుట్టుపక్కల గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని వారిని కూడా దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని సూచించారు. సిల్వర్ సెట్ అర్హత పరీక్ష ఈనెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నత్తతో పోటీ..!

- జిల్లాలో రూ.690 కోట్లతో హంద్రీనీవా విస్తరణ పనులు
- సబ్ కాంట్రాక్టర్లదే హవా.. కనిపించని పురోగతి
- జూన్ 10లోగా పూర్తి చేయాలని లక్ష్యం

హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణకు గతంలో టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2019 తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చాక పనులకు స్పీడ్‌బ్రేక్ పడింది. రూ.6,182 కోట్లతో 6,300 క్యూసెక్కులకు విస్తరిస్తామంటూ టెండర్లు పేరిట మాయ చేసింది. గంపెడు మట్టి తీయకుండా ఐదేళ్ల పాటు రైతులకు తీరని అన్యాయం చేశారు. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో కొలువుదీరిన ప్రభుత్వం రాయలసీమ కరువు పల్లెసీమలను సస్యశ్యామలం చేయడానికి వీలైనంత ఎక్కువ కృష్ణా వరద జలాలు మళ్లించేందుకు విస్తరణ బ్యాలెన్స్ పనులు చేపట్టింది. జూన్ 10లోగా పూర్తి చేయాలని లక్ష్యం. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థలు సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. పురోగతి నత్తతో పోటీ పడుతుందని తెలుస్తుంది. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నారు. జూలైలో వరదలొస్తే కాలువకు కృష్ణా జలాలు ఎత్తిపోయాల్సి వస్తుంది. పనులు పూర్తి చేయకపోతే రైతులు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం లక్ష్యం 'కృష్ణా'ర్పాణం అవుతుంది. ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్ట్ సంస్థలపై ఒత్తిడి తీసుకొచ్చి గడువులోగా పనులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



పత్తికొండ శివారులో హంద్రీనీవా ప్రధాన కాలువ ఆదోని రోడ్డు మలుపు వద్ద సీసీ లైనింగ్‌కు సన్నాహాలు

కర్నూలు, మే 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలు ఏటేటా వేల టీఎంసీలు కడలిపాలు అవుతున్నాయి. ఆ నీటిని ఎత్తిపోస్తే నిత్యం కరువుతో తల్లడిల్లే రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేయవచ్చని 1983లో అధికారం చేపట్టిన ఎన్టీఆర్ భావించారు. హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు (హెచ్ఎన్ఎస్ఎస్) నిర్మాణానికి బీజం వేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు సైతం ఎన్టీఆర్ మార్గాన్నే అనుసరించాయి. 25 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు ఫేజ్-1 పనులు పూర్తిచేశారు. 2013లో తొలిసారిగా హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు ఎత్తిపోశారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05లక్షల ఎకరాలకు సాగు, 35లక్షల జనాభాకు తాగునీరు అందించే లక్ష్యంగా శ్రీశైలం జలాశయం ఎగువన 40 టీఎంసీలు ఎత్తిపోయాల్సి ఉంది. అందుకోసం 3,850 క్యూసెక్కుల ఎత్తిపోసేందుకు వీలుగా ప్రధాన ఎత్తిపోతల పథకం మాల్యాల లిఫ్ట్ సహా 8 ఎత్తిపోతల పథకాలు వద్ద 12 పంపులు ఏర్పాటుచేశారు. అయితే ఆ సామర్థ్యంలో కాలువను నిర్మించలేదు. దీంతో 2 వేల క్యూసెక్కులు కూడా ఎత్తిపోయలేని పరిస్థితి ఉంది. గడిచిన 12 ఏళ్లలో హంద్రీనీవాకు కృష్ణా జలాలు ఎత్తిపోతల రికార్డులు పరిశీలిస్తే.. 2016-17లో 32.071 టీఎంసీలు. 2018-19లో36.908 టీఎంసీలు, 2019-20లో 40.013 టీఎంసీలు, 2020-21లో 39.576 టీఎంసీలు తీసుకున్నారు. ఈ నాలుగేళ్లలో కూడా వరద రోజులు ఎక్కువగా ఉండడంతో టార్గెట్‌కు కొంత అటుఇటుగా తీసుకున్నాం. మిగిలిన సమయంలో అత్యల్పంగా 7.80 టీఎంసీలు, గరిష్ఠంగా 28-29 టీఎంసీలు తీసుకున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ వరద జలాలు కరువు నేలకు మళ్లించాలంటే 3,850 క్యూసెక్కుల సామర్థ్యానికి కాలువను విస్తరించాలని 2017-18లో అప్పటి సీఎం చంద్రబాబు రూ.1,030 కోట్లతో విస్తరణ పనులు చేపట్టారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఆ పనులు కొనసాగించి ఉంటే కరువుసీమకు నీటి ప్రయోజనం కలిగి ఉండేది. వైసీపీ హయాంలో ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా కరువు రైతులు తీవ్రంగా నష్టపోక తప్పలేదు.

విస్తరణ పనుల్లో కానరాని పురోగతి

ప్రభుత్వం ఏర్పాటయ్యాక సీఎం చంద్రబాబు హంద్రీనీవా విస్తరణపై ఫోకస్ పెట్టారు. ఫేజ్-1 పరిధిలో రూ.690 కోట్లతో పనులు చేపట్టారు. ప్యాకేజీ-1 కింద రూ.260 కోట్లతో చేపట్టే 0/0 నుంచి 88 కిలోమీటర్ల వరకు విస్తరణ పనులను మెగా ఇన్‌ఫ్రా సంస్థ, ప్యాకేజీ-2 కింద రూ.430 కోట్లతో చేపట్టిన 88 కి.మీలు నుంచి 201 కిలో మీటర్లు వరకు విస్తరణ పనులు డీఎస్ఆర్-వీపీఆర్ సంస్థలు జాయింట్ వెంచర్‌గా పనులు దక్కించుకున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం ఈ పనులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. జూన్ 10లోగా పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థలకు లక్ష్యాలను నిర్దేశించింది. మిగిలిన గడువు 31 రోజులే. ఇప్పటికే పనులు మొదలు పెట్టి నెలన్నర దాటింది. 20-25 శాతం కూడా పురోగతి లేదు. మొదట్లో ఏర్పాట్లు వల్ల ఆలస్యమైనా పుంజుకున్నాయా...? అంటే అదీ లేదు.


సబ్ కాంట్రాక్టర్ల పెత్తనం

హంద్రీనీవా విస్తరణ పనులు దక్కించుకున్న ప్రధాన కాంట్రాక్ట్ సంస్థలు ప్యాకేజీలుగా విభజించి సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించారు. సబ్ కాంట్రాక్టర్లతో ఆ స్థాయిలో యంత్ర సామగ్రి లేకపోవడంతో పనులు మందగించాయి. ప్యాకేజీ-1 పనులు చేపట్టిన మెగా ఇన్‌ఫ్రా సంస్థలో పనిచేసే కీలక అధికారి ఒకరు ఓ సబ్ కాంట్రాక్టరును బినామీగా పెట్టుకొని పనులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. మిషనరీ కూడా అంతంతగానే ఉండడంతో వేగంగా పనులు జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రశ్నించిన ఇంజనీర్లపై ఉన్నతాధికారులుకు ఫిర్యాదులు చేసి చీవాట్లు పెట్టిస్తున్నట్లు సమాచారం. దీంతో మాకెందుకు అంటూ క్షేత్రస్థాయి పర్యవేక్షించే ఇంజనీర్లు కొందరు పట్టించుకోవడం లేదు. ప్యాకేజీ-2లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తుంది.

మంత్రి నిమ్మల సమీక్షలు

కృష్ణా జలాలు 2025-26 నీటి సంవత్సరంలో ఎట్టి పరిస్థితుల్లో చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గానికి తీసుకెళ్లాలి. అది సాకారం కావాలంటే కాలువ విస్తరణ వేగంగా జరగాలి. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హంద్రీనీవా విస్తరణ పనులపై పర్యవేక్షిస్తున్నారు. మూడు రోజుల క్రితం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంజనీర్లు, కాంట్రాక్ట్ సంస్థలో సమీక్ష నిర్వహించారు. పురోగతి లేమిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగైతే జూన్ 10లోగా ఎలా పూర్తి చేస్తారని మండిపడ్డారు. మంత్రి సమీక్ష తరువాత కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లలో కొంతమేరకు చలనం వచ్చినట్లు తెలుస్తుంది. ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు వంటి యంత్రసామగ్రిని పెంచారని ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు.

గడువులోగా పూర్తి చేస్తాం



హంద్రీనీవా విస్తరణ పనులపై మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష నిర్వహించారు. ఆ తరువాత కాంట్రాక్టర్లలో కూడా చలనం వచ్చింది. అవసరమైన మేరకు ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు సమకూర్చారు. ఎట్టిపరిస్థితుల్లో జూన్ 10లోగా పూర్తి చేసేలా వేగంగా పనులు చేయిస్తున్నాం. 25 శాతానికి పైగా పురోగతి సాధించాం.

- పాండురంగయ్య, ఎస్ఈ, హంద్రీనీవా ప్రాజెక్టు, కర్నూలు

హంద్రీనీవా కాలువకు ఎత్తిపోసిన వరద జలాల వివరాలు (టీఎంసీల్లో)

సంవత్సరం	లిఫ్ట్ చేసినది
2012-13	2.00 (ట్రయల్ రన్)
2013-14	9.904
2014-15	16.806
2015-16	7.798
2016-17	32.071
2017-18	28.705
2018-19	36.908
2019-20	40.013
2020-21	39.576
2021-22	26.841
2022-23	23.747
2023-24	32.333
2024-25	28.198



హంద్రీనీవా కాలువ 9.5 కి.మీల వద్ద విస్తరణ పనులు



హంద్రీనీవా విస్తరణ పనుల్లో భాగంగా 7.51 కి.మీల వద్ద రాళ్లను తవ్వేస్తున్న దృశ్యం

ఉత్కంఠ భరితం..

- ప్రత్యేక వాహనాల్లో కౌన్సిలర్ల తరలింపు
- కోరం లేక ముగిసిన అవిశ్వాస తీర్మానం
- భారీ భద్రత, 144 సెక్షన్ అమలు
- మినిట్స్‌ను కలెక్టర్‌కు పంపుతాం : ప్రిసైడింగ్ ఆఫీసర్ నాగజ్యోతి
- సభకు హాజరైనవారంతా టీడీపీ కౌన్సిలర్లే: ఎమ్మెల్యే గిత్తా
- చైర్మన్‌గా కొనసాగనున్న దాసి సుధాకర్‌రెడ్డి
- పటేల్ సెంటర్‌లో ఎంపీ బైరెడ్డి శబరి వర్గీయుల సంబరాలు



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, చైర్మన్, కౌన్సిలర్లు

నందికొట్కూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన సభ ఉత్కంఠ భరితంగా సాగింది. గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రిసైడింగ్ ఆఫీసర్ నాగజ్యోతి ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మాన సభ జరిగింది. ఈ సభకు నోడల్ ఆఫీసర్‌గా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ వ్యవహరించారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భారీ భద్రతను ఏర్పాటుచేశారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 144 సెక్షన్‌ను పోలీసులు విధించారు. కార్యాలయం ముందున్న దుకాణాలను బంద్ చేయించారు. ఉదయం 11గంటలకు సభ ప్రారంభం కాగానే మొదట మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆధ్వర్యంలో ఆయన వర్గంలోని 16మంది కౌన్సిలర్లు ప్రత్యేక వాహనాల్లో అక్కడి చేరుకున్నారు. అనంతరం మరో కౌన్సిలర్ షేక్ అబ్దుల్ హమీద్ హాజరయ్యారు. దీంతో మొత్తం 18 మంది కౌన్సిలర్లు సభకు హాజరయ్యారు. అయితే ఎంపీ డా.బైరెడ్డి శబరి వర్గానికి చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు, వైసీపీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టాలంటే మొత్తం సభ్యుల్లో 2-3 కౌన్సిలర్లు హాజరైతేనే కోరం ఏర్పడుతుంది. ఈ దమాషా ప్రకారం 29 మంది కౌన్సిలర్లలో 20 మంది మాత్రమే హాజరు కావాల్సి ఉంది. సభ నిర్వహణకు ఇంకా ఇద్దరు కౌన్సిలర్లు తక్కువగా ఉండడంతో 11.30 గంటలకు సభను 12గంటలకు వాయిదా వేశారు. 12 గంటలకు తిరిగి సభ ప్రారంభం కాగానే 17 మంది కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారని, దీంతో కోరం లేకపోవడంతో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టేందుకు అవకాశం లేదని అందువల్ల సభను ముగిస్తున్నట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ నాగజ్యోతి తెలిపారు. ఆ సమయంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానంను మరో 15 రోజుల్లో ప్రవేశపెట్టేందుకు అవకాశం కల్పించాలని ప్రిసైడింగ్ ఆఫీసర్‌ను కోరారు.

మిగతా 7వ పేజీలో

కుంగిన టన్నెల్



7లో

రేపటి నుంచి 'జై జవాన్' ఫెస్టివల్

కర్నూలు కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శనివారం నుంచి ప్రారంభిస్తున్న సాంస్కృతిక వారోత్సవాలకు 'జై జవాన్' కల్చరల్ ఫెస్టివల్ పేరుతో నిర్వహిస్తున్నట్లు కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. గురువారం సాయంత్రం కళాక్షేత్రం కార్యవర్గం సమావేశమై అనేక నిర్ణయాలు తీసుకొని, ప్రతిరోజూ అరగంట పాటు సాంస్కృతిక కార్యక్రమంలో దేశభక్తి పాటలు, దేశభక్తి నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 16న సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్ కార్యాలయం నుంచి టీజీవీ కళాక్షేత్రం వరకు రంగస్థల కళాకారులు, కవులు, రచయితలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ర్యాలీలో 'జై జవాన్...జై కిసాన్' అనే నినాదాలతోపాటూ స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో ఈ ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈ ర్యాలీలో జబర్దస్త్ ఫేం కళాకారులు కూడా ర్యాలీలో పాల్గొని దేశ సైనికులకు తమ సంఘీభావం తెలియజేస్తారని తెలి పారు. ఈ ర్యాలీలో కళాకారులతోపాటూ సామాజిక సేవకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువజన సంఘాలు, అన్ని రంగాలకు చెందిన వారు ఈ ర్యాలీలో పాల్గొని దేశ సైనికులకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ దేశభక్తిని చాటుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. సమావేశంలో టీజీవీ కళాక్షేత్రం ప్రతినిధులు టి.రాజారత్నం, మహమ్మద్ మియా, శివయ్య, యాగంటీశ్వరప్ప, సంగా ఆంజనేయులు, వాల్మీకి రాముడు తదితరులు పాల్గొన్నారు.

బయో మైనింగ్ త్వరగా పూర్తి చేయాలి

కమిషనర్ రవీంద్రబాబు



డంప్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలంలోని గార్గేయపురం డంప్‌యార్డులో ప్రారంభమైన బయో మైనింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. గురువారం డంప్‌యార్డులో బయోమైనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డంప్ యార్డులో నిల్వ ఉన్న దాదాపు 65 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రానున్న మూడు నెలల్లోపు బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా శుద్ధీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకు ముందు సెట్కూరు కార్యాలయం వద్ద ఉన్న అన్నక్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. అనంతరం కొత్తబస్టాండు, గుత్తిపెట్రోలు బంకు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ గంగాధర్ ఉన్నారు.

బాలల వసతి గృహం తనిఖీ

కర్నూలు లీగల్, మే 8(ఆంధ్రజ్యోతి): కర్నూలు మిలిటరీ కాలనీలోని అభయగిరి చిల్డ్రన్స్ హోంను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకట శేషాద్రి గురువారం తనిఖీ చేశారు. ఆశ్రమంలోని నిరాశ్రయులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ్రమం రికార్డులను, పరిశుభ్రతను బాలలకు అందించే ఆహార వైద్యసదుపాయాల గురించి ఆయన నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వారికి ఏమైనా సమస్యలు వస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 15100కు ఫోన్ చేయాలన్నారు.

శానిటేషన్ సెక్రటరీలకు ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు

కర్నూలు న్యూసిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో గత నెల పదవీ విరమణ పొందిన ఇద్దరు శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ల స్థానంలో ఇద్దరు శానిటేషన్ సెక్రటరీలకు ఇన్‌చార్జి ఇన్స్‌పెక్టర్లుగా నియమిస్తూ కమిషనర్ రవీంద్రబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 22వ సచివాలయంలో పనిచేస్తున్న జి.మల్లికార్జునయ్యకు మలేరియా డివిజన్ శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా, 52వ సచివాలయంలో పని చేస్తున్న బి.నాగేశ్వర రావును 96వ సచివాలయానికి బదిలీ చేయడంతోపాటు 15వ డివిజ న్‌కు శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

మైనార్టీ వెల్ఫేర్ అధికారిని కలిసిన మన్సూర్ అలీఖాన్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 8(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ట్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబీహా పర్వీన్‌ను గురువారం ఏపీ రాష్ట్ర హజ్ కమిటీ నూతనంగా ఎన్నికైన సభ్యులు నూర్ మన్సూర్ ఆలీఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే హజ్ యాత్రికులకు సేవచేసే అవకాశం లభించడం అరుదైన అవకాశమని, ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన హజ్ కమిటీ సభ్యులు నూర్ మన్సూర్ ఆలీఖాన్‌ను సబీహా పర్వీన్, కార్యాలయ ఉద్యోగులు సన్మానించారు. అనంతరం మైనార్టీ అంశాలపై చర్చించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని నగర ఆయిల్ మిల్ అండ్ రైస్ మిల్ కార్మికుల యూనియన్ కార్యదర్శి సీహెచ్.సాయిబాబా పిలుపునిచ్చారు. గురువారం కేకే భవన్‌లో కార్మికులతో జరిగిన చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8 గంటల పనివిధానాన్ని కొన సాగించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. ఈ సమావేశంలో గాలెన్న, హనుమంతు, శేఖర్, మద్దిలేటి పాల్గొన్నారు.

రెండో రోజూ కార్మికుల నిరసన

కర్నూలు న్యూసిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని కోరుతూ చేపట్టిన నిరసన గురువారం రెండో రోజుకి చేరింది. నగర పాలక కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుమీర్ బాషా, రవూఫ్ బాషా, రంగ పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం

సి.బెళగల్, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయోధ్యనగర్‌లో వెలిసిన పోతులూరు వీరబ్రహ్మేం ద్రస్వామి రథోత్సవం గురు వారం వైభవంగా నిర్వహిం చారు. ఆరాధనోత్సవాల్లో భా గంగా ఆలయ ధర్మకర్త శ్రీని వాసులు ఆచారి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొ క్కులు చెల్లించుకున్నారు. దూరప్రాంతాల నుంచి వ చ్చే భక్తులకు అన్నదాన కా ర్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు వెంకట రాముడు, బ్రహ్మయ్య, తిరుమలేశు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

విజన్ ప్లాన్‌ను రూపొందించాలి

జాయింట్ కలెక్టర్ బి.నవ్య

కర్నూలు న్యూసిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ సమ్మిళితంగా విజన్ ప్లాన్‌ను రూపొందించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పరిషత్ సమా వేశ భవనంలో స్వర్ణాంధ్ర-2047లో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాల విజన్ కార్యాచరణ ప్రణాళిక, నియోజకవర్గాల వారీగా వర్క్ షాప్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విజన్ ఆంధ్ర లో ఉండే పది సూత్రాలు జీరో పవర్టీ, అగ్రికల్చర్ సెక్టార్, వాటర్ సెక్యూరిటీ, స్కిల్ డెవపల్‌మెంట్, సోషల్ సెక్యూరిటీ ఆవిధంగా అభివృద్ధి, సంక్షేమ సమ్మిళితంగా విజన్ ప్లాన్ రూపొందించాలన్నారు. సామాజిక భద్రతా పెన్షన్ల విషయంలో దేశంలోనే మొదటి స్థానంలోనే ఉన్నామ న్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ అడ్వైజర్ సీతాపతిరావు మాట్లాడుతూ విజన్‌లో భాగంగా నియోజకవర్గస్థాయిలో ప్రణాళిక ఏవిధంగా రూపొం దించుకోవాలనే విషయంపై ఈరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. యాక్షన్ ప్లాన్ ఏవిధంగా తయారు చేయాలనే విషయాన్ని పీపీటీ ద్వారా హాజరైన సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, సీపీవో హిమ ప్రభాకర్‌రాజు, కర్నూలు ఆర్‌డీవో సందీప్‌కుమార్, పత్తికొండ ఆర్‌డీఓ భరత్, నంద్యాల సీపీఓ వేణు గోపాల్, నగరపాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

రేపటి నుంచి చెన్నకేశవస్వామి ఉత్సవాలు

ఓర్వకల్లు, మే 8(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో వెలసిన చెన్నకేశవ స్వామి ఉత్సవాలు ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బి.చంద్రశేఖర్ రెడ్డి గురువారం తెలిపారు. శనివారం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు దేవస్థానం ఆధ్వర్యంలో సమర్పించ నున్నారు. 11న వైశాఖ శుద్ధ చతుర్దశి రోజున ప్రాతఃకాల అర్చన, హోమం, బలిహరణం, మధ్యాహ్నం 3 గంటలకు చెక్కభజన, అనంతరం సాయంత్రం 6 గంటలకు ప్రభోత్సవం, గరుడోత్సవం, 12న వైశాఖ శుద్ధ పౌర్ణమి ఉదయం, సాయంత్రం పూజాదీక్ష హోమాలు, బలిహరణం, సాయంకాలం రథాంగ హోమం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం నిర్వహిస్తారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరు కానున్నారు. 13న ఉదయం వసంతోత్సవం, మధ్యాహ్నం చూర్ణస్నపనం, పూర్ణాహుతి, సాయంత్రంధ్వజారోహనం, పారువేట నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో చంద్రశేఖర్ రెడ్డి, తెలిపారు. ఈనెల 9న భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 9701868289 నెంబరును సంప్రదించాలన్నారు. 11న తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నాయకులు స్వామిరెడ్డి, భైరా పురం వాసుదేవరెడ్డి తెలిపారు. వివరాలకు 9440347812, 8333007780 నెంబర్లను సంప్రదించాలన్నారు. 12న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారు. వివరాలకు 9849529343, 9182639342 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.



ఓర్వకల్లులోని చెన్నకేశవస్వామి ఆలయం

తాళం వేసిన ఇంట్లో చోరీ

● బంగారు ఆభరణాల అపహరణ



చోరీ వివరాలను పోలీసులకు విన్నవిస్తున్న బాధితుడు

గూడూరు, మే 8(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గూడూరు పట్టణంలో రాజవీధి క్వార్టర్స్‌లోని ఓ ఇంట్లో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ భార్యా పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. బుధవారం అతడు కుటుంబంతో కలిసి అనంతపురం జిల్లా యాడికిలో బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటంతో చూసి గుర్తుతెలియని దుండగులు తలుపులు పగులగొట్టి బీరువాలోని మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, పది తులాల వెండి ఆభరణాలు అపహరించుకు వెళ్లారు. గురువారం చోరీ విషయాన్ని గమనించిన ఇంటిపక్కల వారు మోహన్‌కు సమాచారం అందించారు. అతడు హుటాహుటిన గూడూరుకు చేరుకొని పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటన జరిగిన ఇంటిని పరిశీలించారు.

పరీక్షల ఫలితాలు విడుదల చేయాలి

కర్నూలు అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ, డిగ్రీ స్పెషల్ సప్లమెంటరీ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. ఒక్కొక్క సబ్జెక్టుకు రూ. 2 వేలు వసూలు చేసి పరీక్షలు నిర్వహించారని, ఫలితాల విడుదల ఎందుకు జాప్యం జరుగుతుందని ప్రశ్నించారు. ఉన్నత చదువులు చదువుకోవాలనే ఆశపడే విద్యార్థులు ఈ ఏడాది అవకాశం కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పీజీ ఫెయిల్ అయిన విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసి నాలుగు నెలలు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో స్పెషల్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించకపోవడంతో డీఎస్సీ, పీజీటీ, టీజీటీ రాసే అవకాశం అభ్యర్థులు కోల్పోయినట్లేనన్నారు.

రోడ్డు వేయాలి: సీపీఎం



గుంతల రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని 19వ వార్డు జొహరాపురం నుంచి వెంకాయపల్లె వరకు తారు రోడ్డు వేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు పార్వతయ్య డిమాండ్ చేశారు. గురువారం గుంతలు పడిన రోడ్డును సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొహరాపురం నుంచి వెంకాయపల్లె వరకు రోడ్డు మొత్తం గుంతల మయంగా మారిందన్నారు. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎండీ షరీఫ్, నాయకులు షేక్ మహమూద్, గౌస్ బాషా, షేక్షావలి పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

ఓర్వకల్లు, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామంలో దివంగత రవికుమార్ జ్ఞాపకార్థం ఉమ్మడి జిల్లా స్థాయి ఓపెన్ క్రికెట్ పోటీలు (హార్డ్ టెన్నిస్ బాల్) నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. పోటీలో పాల్గొను టీమ్ సభ్యులు రూ.1000 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. మొదటి నుంచి నాలుగు వరుసగా బహుమతులు రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10 వేలు దాతల సహకారంతో నగదును అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 9014659220, 6302872257 నెంబర్లను సంప్రదిం చాలని సూచించారు.

నీటికుంటల నిర్మాణాన్ని వేగవంతం చేయండి

సి.బెళగల్, మే 8(ఆంధ్రజ్యోతి): నీటికుంటల నిర్మాణం వేగవంతం చేయాలని ఏపీవో రామన్న ఉపాధి సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఈసీ రంగస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ జాబుకార్డు ఉన్న ఉపాధి కూలీలు బ్యాంక్ ఖాతకు ఆధార్ నంబరు తప్పనిసరి లింక్ చేసుకోవాలన్నారు. మండలంలోని 18 గ్రామ పంచ యతీల్లో పాడి పశువుల కోస తాగునీటి తోట్లు నిర్మించేందుకు సిద్ధం చేయాలన్నారు. పురాతనమైన బావుల్లో పూడికతీతకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, అలాంటి బావులు పంచాయతీల్లో ఉంటే తక్షణమే పూడిక తీయాలని సూచించారు.

ఉపాధి పనులను వినియోగించుకోండి

సి.బెళగల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు ఉపాధి పనులను వినియోగించుకోవాలని ఎంపీడీవో రాణెమ్మ కూలీలకు సూచించారు. గురువారం మండలంలోని పోలకల్లు, ఇనగండ్ల గ్రామాల్లో ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో జాబు కార్డు ఉన్నవారందరు ఉపాధి పనులను పొందాలన్నారు. ఉపాధి పనులకు హాజరైన కూలీలకు మాత్రమే మస్టర్లో హాజరు వేయాలని సిబ్బందికి సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పనులకు ఉదయాన్నే వెళ్లాలన్నారు. ఏపీవో రామన్న, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

భారత సైనికుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



సైనికుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న వైసీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టిన భారత సైనికుల చిత్రపటాలకు వైసీపీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. గురువారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం చేసిన సైనికుల సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, ఎస్‌టీ.షేక్ అహ్మద్, మునెమ్మ, సీనియర్ నాయకుడు గడ్డం రామక్రిష్ణ, కిషన్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

కోడుమూరు రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తిలో దేవర పురస్కరించుకుని గురువారం రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 24 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మొదటి 9 జతల విజేతలకు దాతలు నగదు బహుమతి ప్రకటించారు. పోటీల్లో బి.తాండ్రపాడుకు చెందిన వరలక్ష్మి ఎద్దులు 4986 అడుగులతో మొదటిస్థానంలో నిలిచాయి. చల్లా వెంకట్రాముడు, కొచ్చెర్వు రవి రూ.50వేల నగదును అందజేశారు. అనంతరం తర్వాత విజేతలకు వరుసగా పెద్దరంగారెడ్డి బ్రదర్స్ రూ.40వేలు, వెంకట్రావు బ్రదర్స్ రూ.30 వేలు, జట్ల వెంకటేశ్వర్లు బ్రదర్స్ రూ.25వేలు, ముబారక్ ట్రేడర్స్, సుభాన్ గ్రామ కమిటీ రూ.20వేలు, మైనార్టీ నాయకుడు బందే నవాజ్ రూ.15వేలు, రాఘవేంద్ర రూ.10వేలు, బొగ్గులబట్టి ప్రసాద్ రూ.5వేలు, మాజీ ఎంపీటీసీ బందే నవాజ్ రూ.3వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్.మెహరున్‌బీ, నాగభూషణంరెడ్డి, జట్ల వెంకటేశ్వర్లు, ఉగాది వెంకటేశ్వర్లు, మోదీన్ సలీం, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.



బండను లాగుతున్న ఎద్దులు

తైక్వాండో శిక్షణా శిబిరం ప్రారంభం



తైక్వాండో శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, మే 8(ఆంధ్రజ్యోతి): స్థానిక టౌన్ మోడల్ క్రీడా ప్రాంగణంలో నగర పాలక సంస్థ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో శిక్షణను టౌన్ మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుంకన్న, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ గురువారం ప్రారంభించారు. విద్యార్థులు తైక్వాండో విన్యాసాలను ప్రదర్శించారు. అనంతరం టౌన్ మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుంకన్న మాట్లాడుతూ తైక్వాండో క్రీడతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ మాట్లాడుతూ తైక్వాండో క్రీడతో శారీరక ధృడత్వం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీధర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసులు, శిక్షకుడు సతీష్, వీరేష్‌బాబు, శివ పాల్గొన్నారు.

రీసర్వేతో రైతుల సమస్యలు పరిష్కారం

సి.బెళగల్, మే 8(ఆంధ్రజ్యోతి): రీసర్వేతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. గురువారం బ్రాహ్మణదొడ్డి గ్రామంలో రీసర్వేను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్వేయర్ నాగభూ షణం, వీఆర్వోలు మంజీరా, శేఖర్, రంగముని పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సెలవులు రద్దు

● అత్యవసర వైద్యంపై సన్నద్ధంగా ఉండాలి

● కర్నూలు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శ్రీరాములు

కర్నూలు హాస్పిటల్, మే 8 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్'తో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కర్నూలు జీజీహెచ్‌లో పని చేస్తున్న వైద్యులు, సిబ్బందికి సెలవులను రద్దు చేస్తూ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.శ్రీరాములు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ యుద్ధం నేపథ్యంలో వైద్యులకు ఆయన పలు కీలక సూచనలు చేశారు. అత్యవసర సమయంలో మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో ఎలా వైద్యం అందించాలనే దానిపై మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు. ఆసుపత్రిలో ఉన్న ఆక్సిజన్, వెంటిలేటర్స్ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

'పది' షార్ట్ మార్కులిస్టులు విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన షార్ట్ మెమో(తాత్కాలిక మార్కులిస్టు)లు విడుదలయ్యాయని, వీటిని డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల లాగిన్ ఉపయోగించి సబ్జెక్టు వారీగా మార్కుల జాబితాను డౌన్‌లోడు చేసి వాటిపై సంతకంచేసి కాపీలను విద్యార్థులకు అందజేయాలని సూచించారు. షార్ట్ మెమోలో ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు గుర్తించిన ఏమైనా దిద్దుబాట్లను ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ ఏపీ విజయవాడ వారి దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. దిద్దుబాట్ల కోసం అవసరమైన పత్రాలు ఏమైనా ఉంటే వాటిని అందించాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. అడ్మిషన్ రిజిస్టర్‌కు జత చేయబడిన పాఠశాల రికార్డుల ఆధారాలు, ప్రధానోపాధ్యాయులు ధృవీకరించిన షార్ట్ మెమోను, పైన పేర్కొన్న పత్రాలనలు మే 25వ తేదీలోపు ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ విజయవాడ కార్యాలయానికి పంపాలని డీఈవో పేర్కొన్నారు.

కూడళ్లలో హోర్డింగులను తొలగించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు న్యూసిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని కూడళ్లలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలకు సంబంధించిన ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఎల్ఈడీ బ్యానర్లను తొలగించాలని ఆర్ఎస్ఎఫ్, పీఎస్ఏ, ఎస్ఎస్ఏ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ముందస్తు అక్రమ అడ్మి షన్లు, ప్రచారాలు చేసున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల బ్యానర్లను తొలగించాలన్నారు.

తలసేమియా ప్రాణాంతక వ్యాధి

రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మహేంద్ర కుమార్



రక్తదానం చేస్తున్న పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు

కర్నూలు హాస్పిటల్, మే 8 (ఆంధ్రజ్యోతి): తలసేమియా ప్రాణాంతక వ్యాధి అని, వైద్య పరీక్షల ద్వారా దీన్ని గుర్తించవచ్చునని రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ మహేంద్ర కుమార్, మెడికల్ ఆఫీసర్ రామచంద్రరావు అన్నారు. ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో పుల్లయ్య ఇంజనీరింగ్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీ విద్యార్థులు 21 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం తలసేమియా చిన్నారులకు స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు. తలసేమియా చిన్న పిల్లల కోసం అవసరమైనప్పుడు రక్తం ఎక్కించేందుకు బ్లడ్ బ్యాంకులో ఏర్పాట్లు చేశామ న్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యులు గార్గేయపురం శ్రీనివాసులు, కేవీ సుబ్బారెడ్డి, భీమశంకర్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ రమేష్‌బాబు, డాక్టర్ కుమారస్వామి రెడ్డి పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు అందజేత

కర్నూలు స్పోర్ట్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దమార్కెట్ సమీపంలో కేఎంసీ పార్కులో తైక్వాండో సాధన చేస్తున్న క్రీడాకారులకు వీఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ వాసురెడ్డి, డాక్టర్ వినీషారెడ్డి ఆర్థిక సాయం కింద క్రీడా పరికరాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులనుద్దేశించి వారు మాట్లాడుతూ తైక్వాండో క్రీడా స్పోర్ట్స్ కోటాలో ఉందని అన్నారు. ఇలాంటి క్రీడ సాధనం చేయడంతో విద్య, ఉద్యోగావకాశాల్లో చాలా లాభాలు ఉంటాయని అన్నారు. అనంతరం దాతను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఉమేష్, అజయ్, శ్రీలలిత, భార్గవ్, మల్లేష్, అఖిల్, తైక్వాండో, జిల్లా కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితం..



సమావేశం ముగిసిన అనంతరం బయటకు వస్తున్న చైర్మన్

5వ పేజీ తరువాయి

ప్రిసైడింగ్ ఆఫీసర్ నాగజ్యోతి స్పందిస్తూ ప్రస్తుతం జరిగిన సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను కలెక్టర్‌కు అందజేస్తామని ఆతర్వాత కలెక్టర్ సూచించిన మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతానికి కోరం లేకపోవడంతో సభలో ముగిస్తున్నట్లు ఆమె తెలిపారు.

హాజరైన కౌన్సిలర్లు వీరే...

ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్గానికి చెందిన కౌన్సిలర్లు మొల్ల మహబూబ్ రబ్బాని(వైస్ చైర్మన్), కాటేపోగు చిన్నరాజు, మొల్ల జాకీర్ హుస్సేన్, బోయ జయమ్మ, షేక్ రేష్మా, దేశెట్టి సుమలత, యం.కరిష్మా, జి.భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి విజయమ్మ, పాతకోట శాంతకుమారి, మన పాడు అశోక్, కొండేజు కృష్ణవేణి, ఉండవల్లి ధర్మారెడ్డి, గుర్రాల లక్ష్మీదేవి, ఎం.వాణి, కోఆప్షన్ మెంబర్ శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఎంపీ వర్గానికి చెందిన మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ షేక్ అబ్దుల్ హమీద్, కోఆప్షన్ సభ్యుడు యస్.అబ్దుల్ గఫ్ఫార్ మాత్రమే హాజరయ్యారు. ఎంపీ వర్గానికి చెందిన మిగిలిన 9 మంది కౌన్సిలర్లు, వైసీపీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేకపోవడం అవిశ్వాస తీర్మాణ సభ జరగకుండానే సమావేశం ముగిసింది.

మరో అవకాశమివ్వాలి: ఎమ్మెల్యే జయసూర్య

ప్రస్తుతం జరిగిన అవిశ్వాస తీర్మాన సభకు తనతో పాటు 15మంది కౌన్సిలర్లు హాజరయ్యారని, వారంతా టీడీపీకి చెందిన వారేనని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. కోరం 20మంది లేకపోవడంతో సభను ఫలితం తేలకుండా ముగించారని, తునిలో జరిగిన విధంగా మరో సారి అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని ప్రిసైడింగ్ ఆఫీసర్ నాగజ్యోతిని కోరినట్లు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. మరోసారి అవకాశం ప్రవేశపెట్టేందుకు మున్సిపల్ చట్టంలో ఉందని, వాటిని పరిశీలించి అవిశ్వాస తీర్మానానికి మరోమారు అవకాశం కల్పించాలని కోరారు.

బాణసంచా పేల్చి..

మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన సభ కోరంలేక ముగియడంతో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వర్గీయులు పటేల్ సెంటర్‌లో బాణసంచా కాల్చుతూ, మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కౌన్సిలర్ చాంద్ బాషా, సత్యనారాయణ, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ మహేష్‌నాయుడు, పల్లె రఘురామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పటేల్ సెంటర్‌లో బాణసంచా కాల్చుతున్న ఎంపీ బైరెడ్డి శబరి వర్గీయులు

జంట హత్యల కేసులో 11 మందికి జీవిత ఖైదు



పోలీసు బందోబస్తు మధ్య జైలుకు తరలుతున్న నిందితులు



విచారంతో జైలుకు తరలుతున్న నిందితులు

- చెరుకులపాడు నారాయణ రెడ్డి హత్యకేసు..
- నిర్దోషులుగా ఐదుగురు
- రోదనలతో మిన్నంటిన కోర్టు ఆవరణం
- హత్య జరిగిన 8 ఏళ్లకు శిక్ష ఖరారు
- కర్నూలు జిల్లా కోర్టు సంచలన తీర్పు

కర్నూలు లీగల్/కర్నూలు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల నాటి జంట హత్యల కేసులో కర్నూలు జిల్లా కోర్టు సంచలన తీర్పునిచ్చింది. వైసీపీ నాయకుడు, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భర్త కంగాటి లక్ష్మీనారాయణ రెడ్డి అలియాస్ చెరుకులపాడు నారాయణరెడ్డి, అతని అనుచరుడు బోయ సాంబశివుడుల జంట హత్యల కేసులో 11 మంది నిందితులపై జీవిత ఖైదు, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ కర్నూలు ప్రిన్సిపుల్స్ సెషన్స్ న్యాయాధికారి జి.కబర్ది గురువారం సంచలన తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు హత్య జరిగిన 2017 మే 21వ తేదీన చెరుకు లపాడు నారాయణ రెడ్డి తన అనుచరులతో కలిసి వెల్దుర్తి మండలం పోసానిపల్లిలో ఒక పెళ్లికి హాజరై ఆ తర్వాత రామకృష్ణాపురంలో మరో పెళ్లికి హాజరయ్యేందుకు తన అనుచ రులతో కలిసి రెండు వాహనాల్లో బయలు దేరారు. నారాయణరెడ్డి వాహనం క్రిష్ణగిరి రోడ్డులోని ఓ కల్వర్టు దగ్గర చేరుకుని, కల్వర్టు రిపేరి ఉండటంతో తమ ఫార్చునర్ కారును నెమ్మదిగా పోనిస్తుండగా.. కాపుకాచిన నిందితులు పక్క పొలాల నుంచి రెండు ట్రాక్టర్లతో వచ్చి నారాయణరెడ్డి కారును వెనుక వైపు నుంచి, ముందు వైపు నుంచి ఢీకొట్టాయి. దీంతో కారు నుజ్జయి ఆగిపోయింది. పారిపోవడానికి యత్నించిన నారాయణరెడ్డిని మిగతా నిందితులు కారులో నుంచి బయటకు లాగారు.

అనంతరం నిందితులు కొడవళ్లు, కత్తులు, నాటు బాంబులతో దాడి చేయడంతో నారాయణరెడ్డి తీవ్రంగా గాయపడి కిందపడ్డాడు. కొన ఊపిరితో ఉన్న ఆయన తలపై నిందితులు పెద్ద బండరాయిని వేయడంతో అక్కడే మృతిచెందాడు. అదే కారులో ప్రయాణిస్తున్న అనుచరుడు బోయ సాంబశివుడును కూడా నిందితులు మారణాయుధాలతో అక్కడే హత్యచేశారు. నారాయణరెడ్డి కారు డ్రైవర్ గొల్ల కృష్ణమోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణగిరి పోలీసులు కేసు నమోదు చేసి 19 మంది నిందితులపై కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. చార్జ్‌షీటులో నిందితులుగా ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, టీడీపీ నాయకురాలు, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పేర్లను కూడా చేర్చడంతో వారు ఉన్నత కోర్టులను ఆశ్రయించడంతో కోర్టు వారి ఇద్దరి పేర్లను కేసు నుంచి తొలగించింది. దీంతో మొత్తం 16 మందిపై కేసు విచారణ జరిగి... 29 మంది సాక్షులను కోర్టు విచారించింది.

ఏ4 నిందితుడు ఆంజనేయులు మృతి

కేసు విచారణ జరుగుతుండగానే ఏ4 నిందితుడు కోతుల ఆంజనేయులు మృతి చెందాడు. మిగిలిన 11 మంది నిందితులు కురువ రామాంజనేయులు, రామనాయుడు, కురువ రామకృష్ణ, కోతుల బాలు, కోతుల చిన్న ఎల్లప్ప, కోతుల పెద్ద ఎల్లప్ప, గంటల వెంకట్రాముడు, గంటల శ్రీను, బీసన్నగారి రామాంజనేయులు, లక్ష్మన్న కుమారుడు రామాంజనేయులు, బీసన్నగారి పెద్ద బీసన్నలపై కోర్టులో నేరం రుజువు కావడంతో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎం.వెంకటరెడ్డి వాదనలు వినిపించారు.

కోర్టులో మిన్నంటిన రోదనలు

చెరుకులపాడు నారాయణరెడ్డి జంట హత్య కేసులో 11 మంది నిందితులపై జీవిత ఖైదు శిక్ష పడిందని తెలియడంతో ఒక్కసారిగా కోర్టు ఆవరణం వారి బంధువులు, కుటుంబీకుల రోదనలతో మార్మోగింది. గురువారం ఉదయం నుంచే నిందితుల కుటుంబ సభ్యులు, బంధువులు, పిల్లలు జిల్లా కోర్టుకు రావడంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. జీవిత ఖైదు పడిన వారిని పోలీసులు వాహనంలోకి ఎక్కిస్తుండగా.. ఒక్కసారిగా వారి భార్య పిల్లలు వారిని చూసి ఆక్రందనలు చేస్తూ పోలీసు వాహనానికి ఎదురొచ్చారు. దీంతో ఎస్కార్ట్ పోలీసులు చొరవ చూసుకుని వాహనం వెళ్లేందుకు చర్యలు తీసుకోవడంతో నిందితులను పోలీసులు కర్నూలు జైలుకు తరలించారు. శుక్రవారం కడప సెంట్రల్ జైలుకు తరలించనున్నారు.

చెరుకులపాడులో భారీ బందోబస్తు



పోలీసుల పహారాలో చెరుకులపాడు గ్రామం

పత్తికొండ/ వెల్దుర్తి, మే 8(ఆంధ్రజ్యోతి): నారాయణరెడ్డి హత్యకేసులో కోర్టు 11 మందికి శిక్ష ఖరారు చేసిన నేపథ్యంలో చెరుకులపాడు గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య పర్య వేక్షణలో సీఐ మధుసూదనరావు, ఎస్ఐ అశోక్ రిజర్వ్‌డ్ పోలీస్ బలగాలతో పహారా కాస్తున్నారు. వెల్దుర్తి, కోసనపల్లి, రామళ్లకోట, గోవర్ధనగిరి, క్రిష్ణగిరి మండలం లోని తొగర్చేడు, కంబాలపాడు, చిట్యాల, క్రిష్ణగిరి గ్రామాల్లో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం : మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి



నా భర్త నారాయణరెడ్డి హత్యకేసుకు సంబంధించి కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నా.. 2017లో నారాయణరెడ్డిని దారుణంగా హత్యచేశారు. హంతకులకు చట్టపరంగా శిక్ష పడాలని న్యాయస్థానాన్ని నమ్ముకున్నాం. ఎనిమిదేళ్ల విచారణ అనంతరం 11 మందికి జీవితఖైదు విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వడం హర్షిస్తున్నాం. ఈ తీర్పుతో కక్షలు, కార్పణ్యాలు పాల్పడే వారికి గుణపాఠంగా స్వాగతిస్తున్నాం. ఈ తీర్పు భవిష్యత్తులో హత్యలు పాల్పడే వారికి భయానికి గురిచేస్తుంది. న్యాయం జరిగింది.

కుంగిన టన్నెల్

- జాతీయ రహదారిపై పెద్ద గుంత
- హైవేపై స్తంభించిన ట్రాఫిక్
- కిలోమీటర్ల మేర ఆగిన వాహనాలు
- కార్మికులకు తప్పిన ప్రమాదం
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు



జాతీయ రహదారిపై ఏర్పడిన భారీ గొయ్యి

కర్నూలు క్రైం/రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- బెంగళూరు జాతీయ రహదారిపై రింగ్ రోడ్డు సమీపంలో చెన్నై-సూరత్ హైవే పనుల కోసం చేపట్టిన టన్నెల్ కొంత భాగం కుంగిపోయింది. దీంతో బెంగళూరు జాతీయ రహదారిపైన పెద్ద గుంత ఏర్పడింది. దీంతో ఆ మార్గంలో వాహనాలను అనుమతించకపోవడంతో పెద్దఎత్తున ట్రాఫిక్ స్థంభించింది. వివరాల్లోకి వెళితే చెన్నై-సూరత్ హైవే కర్నూలు మీదుగా వెళ్తుంది. కర్నూలు నగర శివారులో దూపాడు సమీపంలో బెంగళూరు జాతీయ రహదారిని చెన్నై-సూరత్ హైవే క్రాస్ చేస్తుంది. ఈమార్గంలో జాతీయ రహదారితో పాటు రైల్వే ట్రాక్ ఉండటంతో పైవంతెన మార్గం కాకుండా భూగర్భంలో టన్నెల్ నిర్మాణం చేపట్టింది. ఈహైవే నిర్మాణ పనులు మెగా ఇంజనీరింగ్ కంపెనీ చేపడుతుంది. సుమారు 1.2 కిలోమీటర్ల పొడవు, 18 మీటర్ల వెడల్పుతో 20మీటర్ల లోతులో ఈటన్నెల్ నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి రైల్వే ట్రాక్ దాటి జగన్నాథగట్టు వద్ద పైనుంచి వచ్చి రింగ్‌రోడ్డు జాతీయ రహదారిలో కలుస్తుంది. సుమారు 700మీటర్ల మేర టన్నెల్ నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం జాతీయ రహదారి కింది భాగంలో 20 మీటర్ల లోతులో పనులు జరుగుతున్నాయి. ఈ పనులు చేపట్టే క్రమంలో కొంత భాగం ఉన్నట్టుండి కూలిపోయింది. కింద పనిచేసే కార్మికులకు ఎవరికీ ప్రాణనష్టం జరగలేదు. 20 మీటర్ల లోతులో పెద్ద గోతి ఏర్పడింది. జాతీయ రహదారిపైన సుమారు 200 మీటర్లు పొడవు ఉండటంతో అక్కడ కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావించిన మెగా ఇంజనీరింగ్ కంపెనీ సిబ్బంది ట్రాఫిక్‌ను డైవర్ట్ చేశారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కర్నూలు తాలుకా, ఉలిందకొండ, ట్రాఫిక్ పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వన్‌వేలోనే మళ్లించడంతో..

అటు బెంగళూరు నుంచి కర్నూలుకు, కర్నూలు నుంచి బెంగళూరు వైపునకు, కర్నూలు నుంచి రింగ్ రోడ్డు మీదుగా నంద్యాల, కడప వెళ్లే వాహనాలను కేవలం వన్‌వేలోనే మళ్లించడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. రింగ్ రోడ్డుపైన సుమారు 2 గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఆ రింగ్ రోడ్డు కూడా టన్నెల్ కూడా ఉండటంతో ఒకేసారి అన్ని వాహనాలు అనుమతించడంతో ఈ సమస్య మరింత తీవ్రమైంది. ప్రమాదం జరిగిన వెంటనే కాంట్రాక్టు సంస్థ సిబ్బంది వెంటనే మరమ్మతుల పనులు చేపట్టారు. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు పనులు జరిగాయి. దీంతో అనంతపురం నుంచి కర్నూలు వచ్చే ఆర్టీసీ బస్సులు, వాహనాలు, ఆటోల్లో వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కడ ఏం జరుగుతుందో తెలియక ఆందోళనకు గురయ్యారు..



ఒకే వరుస దారిలో వెళ్తున్న భారీ వాహనాలు

రైలు ఢీకొని రైతు మృతి

ఆదోని, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేకల్లు గ్రామానికి చెందిన రైతు బంగారయ్య (35) పొలానికి వెళుతూ రైల్వే గేటు దాటేక్రమంలో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల మేరకు.. గురువారం ఇస్వీ కుప్పగల్లు రైల్వే స్టేషన్‌ల మధ్య 523/23-24 కి.మీ. వద్ద ట్రాక్ ప్రక్కన తన పొలంలో కనకాంబరాల పంటకు నీళ్ల కట్టడానికి తెల్లవారు జామున ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య తాయమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు.

ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని..

- యువతి బలవనర్మణం

కర్నూలు క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని మనస్తాపం చెంది ఓ యువతి ఉరేసుకొని బలవనర్మణానికి పాల్పడినట్లు సీఐ మధుసూదన్‌గౌడ్ తెలిపారు. వివరాలు.. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన సుభాషిణి (22) అనే యువతి గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సుభాషిణికి వారం క్రితం నిశ్చితార్థమైంది. కొద్ది కాలంగా అమీలియో హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తుంది. గురువారం ఇంట్లో ఉరివేసుకోగా.. తల్లిదండ్రులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తనకు ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని, మనస్తాపానికి గురైన సుభాషిణి ఈ ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్య చేసకునే ముందు తన మిత్రుడు ఆదేశ్‌కు వీడియో కాల్‌చేసి మాట్లాడినట్లుగా పోలీసు విచారణలో తేలింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెళ్లి కావడం లేదని..

- రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మహానంది, మే 8 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. వివరాలు.. మండలంలోని గాజులపల్లికి చెందిన కొత్తూరు ఖలీల్(30) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. 30ఏళ్లు దాటినా పెళ్లి కాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది గురువారం గుంటూరు- గుంతకల్లు రైల్వే మార్గంలోని గాజులపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలిని రైల్వే పోలీసులు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఈతకెళ్లి వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు బాలలు మృతి

ఎమ్మిగనూరు/ ఎమ్మిగనూరు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఈతకెళ్లి నీటమునిగి వేర్వేరు ప్రాంతాల్లో ఒకే రోజు ముగ్గురు బాలురు దుర్మరణం పాలయ్యారు. పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీకి చెందిన రోహన్(10) మండలంలోని రాళ్లదొడ్డికి చెందిన శీను(14), నందవరం మండలం సంజీవపురం గ్రామానికి చెందిన అనూక్(13) ఈతకెళ్లి మృతిచెందారు. స్థానికులు, బాధిత కుటుంబాలు తెలిపిన వివరాలు.. ఎస్ఎంటీ కాలనీలో నివాసం ఉంటున్న ప్రైవేటు టీచర్ శిరో మణి కుమారుడు రోహన్ నాలుగో తరగతి చదువుతున్నాడు. మానసికస్థితి సరిగాలేదు. సెలవులు కావటంతో ఎల్లెల్సీ కాలువ దగ్గరకు వెళ్లాడు. కాలువలో నీటిలో తును గమనించకుండా ఈతకొట్టేందుకు కాలువలోకి దిగి నీటిలో మునిగి ఊపిరాడక మృత్యువాత పడ్డాడు. మండలంలోని రాళ్ల దొడ్డికి చెందిన రామకృష్ణ కుమారుడు శీను సరదాగా ఈతకోసం గ్రామసమీపంలో ఉన్న నీటికుంటకు వెళ్లాడు. నీటిలోకి దిగి ఈత కొడుతుండగా ఫిట్స్ వచ్చి నీటిలోనే మునిగిపోయాడు. ఎంత సేపటికి బయటకు రాలేదు. స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించటంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని నీటికుంటలో పడిపోయిన శ్రీనును వెతికి బయటకు తీశారు. అప్పటికే మృతిచెంది ఉండటంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. నందవరం మండలం సంజీవపురానికి చెందిన అనూక్ తుంగభద్ర నదిలోకి ఈతకెళ్లాడు. నదిలో గుంతలో దిగి ఈతకొట్టేందుకు ప్రయత్నించాడు. ఈత రాకపోవడం, గుంత లోతుగా ఉండటంతో నీటిలో మునిగి ఊపిరాడక మరణించాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా వారు అనూక్‌ను బయటికి తీసి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

మూడు ప్రభుత్వ క్వార్టర్స్ వేలం

కర్నూలు లీగల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డోన్ సమీపంలో జాతీయ రహదారి కోసం ప్రభుత్వం సేకరించిన భూమికి నష్టపరిహారం చెల్లించనందుకు కర్నూలు సీ.క్యాంపులోని మూడు ప్రభుత్వ క్వార్టర్స్‌ను కర్నూలు జిల్లా కోర్టు గురువారం వేలం వేసింది. 2008లో ముగ్గురు బాధితులకు చెందిన భూములను ప్రభుత్వం జాతీయ రహదారిని నిర్మించేందుకు సేకరించింది. డోన్‌కు చెందిన విజయలక్ష్మి, సేగు ఆంజనేయులు, చిన్న సుబ్బారావుకు చెందిన భూమిని అప్పట్లో ప్రభుత్వం సేకరించి నష్టపరిహారాన్ని కూడా నిర్ణయించింది. ఆ నష్టపరిహారం తగినంత లేదని, మార్కెట్ వాల్యూ కంటే తక్కువగా ఉందని ఈ ముగ్గురు బాధితులు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఒక ఎకరాకు రూ.6,42,500 ఇవ్వాలని ప్రభుత్వానికి 2019లో ఆదేశించింది. అయినా కూడా ప్రభుత్వం ఆ నష్టపరిహారాన్ని చెల్లించకపోవడంతో బాధితులు తిరిగి కోర్టును ఆశ్రయించి స్థానిక బీ.క్యాంపులోని మూడు ప్రభుత్వ క్వార్టర్లను వేలం వేసి నష్టపరిహారం ఇప్పించాల్సిందిగా కోర్టును కోరారు. ఈ మేరకు కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది ఆధ్వ ర్యంలో జిల్లా కోర్టులో వేలం పాట జరిగింది. వేలం పాటలో విజయలక్ష్మి తనకు రావాల్సిన నష్టపరిహారం రాబట్టుకునేందుకు వేలం పాటలో పాల్గొని క్వార్టర్స్ నెంబర్. బీ/బీ19ని, సేగు ఆంజనేయులు బీ/సీ6 క్వార్టర్‌ను వేలం పాటలో దక్కించుకు న్నారు. కాగా చిన్న సుబ్బారావు తరుపున మూడో వ్యక్తి బీ/బీ18 క్వార్టర్‌ను వేలం పాటలో దక్కించుకున్నాడు. దీంతో తదుపరి ప్రొసీడింగ్స్‌ను నిర్వహించేందుకు కోర్టు కేసులను వాయిదా వేసింది.

అత్యుత్తమ సేవలకు పురస్కారం



ఉత్తమ సేవలందించినందుకు గాను కలెక్టర్ రంజిత్ బాషాకు గవర్నర్ అబ్దుల్ నజీర్ విజయవాడలో అవార్డు అందజేశారు. - కర్నూలు కలెక్టరేట్

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఆలూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): అధినాయకత్వం ఆదేశాల మేరకు ఆలూరులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ గురువారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెస్తే పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమం అనంతరం మండలాల కన్వీనర్లు, నాయకులతో సమావేశం ఉంటుందన్నారు.

అధికారులు ప్రజలకు సేవ చేయాలి



మద్దిలేటిస్వామిని సన్మానిస్తున్న అధికారులు

మద్దికెర, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు ప్రజలకు సేవచేసి, వారి మన్ననలను పొందాలని జడ్పీటీసీ సభ్యుడు డి.మురళిధర్ రెడ్డి, ఎంపీపీ అనిత యాదవ్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా పని చేస్తూ ఎంపీడీవోగా పదోన్నతిపై వెళుతున్న మద్దిలేటి స్వామిని గురువారం సన్మానించారు. ఎంపీడీవో కొండయ్య, డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి, సర్పంచులు బురుజుల విజయుడు, మల్లికార్జున, కార్యదర్శులు శివకుమార్, పరమేశ్వరప్ప, సుధాకర్, మంజునాథ్, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, నంది జయరాముడు, పంచాయతీ సలహాదారులు ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దేవనకొండ, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఆర్వోలు ప్రజలు, రైతులకు అందుబా టులో ఉండాలని తహసీల్దార్ ప్రసాదురాజు ఆదేశించారు. గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పత్తాలేని వీఆర్వోలు' శీర్షికన కథనం ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ స్పదించారు. రైతుల సమస్యల వివరాలు ఇవ్వాలని, అవినీతికి పాల్పడితే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు.

బాలికల హాస్టల్ మంజూరు చేయండి

క్రిష్ణగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుకొండ గ్రామంలో జడ్పీ పాఠశాలకు అనుబంధంగా బాలికల, బాలుర వసతి గృహలను మంజూరు చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు కటారుకొండ మర్రి శ్రీరాములు కోరారు. ఈ మేరకు గురువారం విజయవాడలో బీసీ సంక్షేమ మంత్రి సవితకు వినతిపత్రం ఇచ్చారు. వసతిగృహం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబుకు తెలియజేశామన్నారు ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మర్రి శ్రీరాములు తెలిపారు.



వినతిప్రతం ఇస్తున్న శ్రీరాములు

కూలీలు జాగ్రత్తలు పాటించాలి



పాలకుర్తిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

దేవనకొండ, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో రమణరావు తెలిపారు. గురువారం మండలంలోని పాలకుర్తిలో చెక్ డ్యాం పూడికతీత పనులను పరిశీలించారు. కూలీలు ఉదయం 7 లోగా పని ప్రారంబించి 11 లోగా పూర్తి చేయాలని, వేతనం రూ.300 వచ్చేలా పని చేయాలన్నారు. ఈసీ పెంచలయ్యను కూలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



కలశాళాలతో వస్తున్న చిన్నారులు, భక్తులు

పత్తికొండ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హోసూరు గ్రామంలో గురువారం వేణుగోపాల స్వామి ఆలయ కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో రూ.కోటి వ్యయంతో ఆలయాన్ని దాతల సహకారంతో నిర్మించారు. సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు.

రేషన్ కార్డు కోసం

దరఖాస్తు చేసుకోండి : తహసీల్దార్

మద్దికెర, మే 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు అవకాశం కల్పించిందని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ అన్నారు. గురువారం కార్యాలయంలో వీఆర్వోల సమావేశం నిర్వహించారు. నూతన రేషన్‌కార్డు, సభ్యుల మార్పులు, చేర్పులు, నతూనంగా వివాహమైన వారు, తల్లిదండ్రుల పేర్లను తొలగించుకోవచ్చన్నారు. అలాగే పిల్లలు ఉంటే వారిని కూడా కార్డులో చేర్పించేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఉద్యోగులు తమ కార్డులను తహసీల్దార్ కార్యాలయం, సచివాలయంలో అప్పగించాలని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ రవికుమార్, వీఆర్వోలు రంగస్వామి, శ్రీరాములు, రషీద్ ఉన్నారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్

ఆదోని అగ్రికల్చర్ మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూ పురపాలక ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు సుధాకర్ బాబుకు డాక్టరేట్ లభించింది. మనో విజ్ఞాన శాస్త్రం విభాగంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్ పట్టాను అందజేసినట్లు సుధాకర్ బాబు తెలిపారు. ప్రొఫెసర్ ఎల్.కుల్లాయి రెడ్డి పర్యవేక్షణలో ఉన్నత పాఠశాలల విద్యార్థుల సాధన ప్రేరణపై అభిజ్ఞాన శైలులు, స్వీయ సామర్థ్యాల ప్రభావం అంశంపై పరిశోధన సమర్పించానన్నారు. హెచ్ఎం అలీమ్ సిద్దికి, ఉపాధ్యాయులు సుధాకర్‌బాబును అభినందించారు.



సుధాకర్ బాబు

సదరం క్యాంపులో దివ్యాంగులకు వైద్య పరీక్షలు(ఫైల్)



దివ్యాంగుల పాట్లు..

● టెక్కలిలో 'సదరం' స్లాట్ ఇచ్చిన అధికారులు

ఆలూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): కొత్త పింఛన్ మంజూరుకు దివ్యాంగులు మెడికల్ బోర్డు నుంచి డిజిటలైజేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలనే నిబంధనను ప్రభుత్వం విధించడంతో దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారు. ఆలూరుకు చెందిన దివ్యాంగుడు రవి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని జిల్లా కేంద్రంలో కాకుండా సుదూర ప్రాంతంలో ఉన్న టెక్కలి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సదరంస్లాట్ బుక్ అయిందని అంత దూరం ఎలా వెళ్లాలని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, జిల్లా అధికారుల స్పందించి డివిజన్ లేకుంటే జిల్లా కేంద్రంలోనే సదరం క్యాంపులు నిర్వహించాలని కోరుతున్నారు.

బొప్పాయే

● ధరలేక పొలంలోనే వదిలేసిన రైతులు



మద్దికెర: పొలంలోనే వదిలేసిన బొప్పాయి పంట

మద్దికెర, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో 90 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశారు. దిగుబడి ఆశా జనకంగా వచ్చింది. అయితే ధర అమాంతం పడిపోయింది. గతంలో కిలో రూ.15-20లు ఉండగా తీరా దిగుబడి వచ్చాక రూ.5లకు పడిపోయింది. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. కొందరు రైతులు పొలంలోనే వదిలేయగా మరికొందరు ఆటోల్లో విక్రయిస్తున్నారు..



ఆటోలో విక్రయిస్తున్న రైతు

ఉపయోగమెప్పుడు?

● సచివాలయ ప్రారంభానికి రాజకీయ గ్రహణం

దేవనకొండ, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలారుదిన్నె గ్రామంలో సచివాలయ భవన నిర్మాణం ఏడాది క్రితమే పూర్తయింది. అయితే ఈ భవనాన్ని ప్రారంభించి, ఉపయోగంలోకి తీసుకురావడంతో అధికారుల, నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అయితే ఈ భవనాన్ని ప్రారంభించేందుకు రాజకీయ గ్రహణం పట్టినట్లు ఆరోపణలున్నాయి. భవనాన్ని పంచాయతీరాజ్ అధికారులు గత డిసెంబరులోనే పంచాయతీ కార్యదర్శికి అప్పజెప్పారు. అయితే ఆలూరు ఎమ్మెల్యే వైసీపీకి చెందినవారు కావడంతో ఆయనతో ప్రారంభించేదుకు అధికారులు భయపడుతున్నట్లు సమాచారం.



ప్రారంభించని సచివాలయ భవనం

చెన్నంపల్లిలో కంటి వైద్యశిబిరం

తుగ్గలి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో మండలంలోని మారెళ్ల గ్రామంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు తెలిపారు. కర్నూలు సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో వైద్యులు డాక్టర్లు చంద్రశేఖర్, జయంతి పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు అందించారన్నారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సల కోసం కర్నూలుకు రెఫర్ చేశారన్నారు. శ్రీనివాసులు గౌడ్, మాజీ ఎంపీటీసీ వెంకట్రాముడు, దేవరెంటి వెంకట్రాముడు, శంకర్, ధనుంజయ, మహేంద్ర, జల్లికిట్ల మద్దయ్య తదితరులు ఉన్నారు.



చెన్నంపల్లిలో కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వైభవంగా సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంపల్లి ఎస్సీ కాలనీలో చందాలు వేసుకుని నిర్మించిన సుంకులమ్మ ఆలయాన్ని ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, యజ్ఞయాగాలతో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. టీడీపీ నాయకులు రాజేంద్రగౌడ్, తిమ్మప్ప గౌడ్, నారాయణస్వామి, మాబాషా, అక్బర్, భక్తులు పాల్గొన్నారు.

బండలాగుడు విజేత కొత్తకోట వృషభాలు



విజేతలకు నగదు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

క్రిష్ణగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): అమకతాడు గ్రామంలో నిర్వహించిన బండలాగుడు పోటీ ల్లో కొత్తకోటకు చెందిన గుర్నాథ్, మల్యాలకు చెందిన షేక్ మైమున్న వృషబాలు ప్రథమ స్థానంలో నిలిచి, 40వేల బహుమతి గెలుచుకున్నాయి. ద్వితీయ స్థానంలో రేమటకు చెందిన చిన్న గిడ్డయ్య, నాయుడు వృషబాలు, తృతీయ స్థానంలో జక్కిలేరుకు చెందిన రషీద్ వృషభాలు నిలిచాయి. వీరికి దాత వెంకటేష్ బహుమతులు అందించారు.



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఈకేవైసీ పూర్తి చేయండి

హాలహర్వి, మే 8 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అందాలంటే ఈకేవైసీ తప్పనిసరని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని నిట్రవట్టి గ్రామంలో ఇంటింటా చేస్తున్న ఈకేవైసీ సర్వేను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా, రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు.



రాజశేఖర్(ఫైల్)

చికిత్స పొందుతూ మృతి

ఆదోని, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన రాజశేఖర్(35) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రైల్వే కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. వివరాల మేరకు.. ఏప్రిల్ 27న ఆదోని రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కబోతూ ప్రమదవశాత్తు కిందపడి కుడి చేయి తెగిపడింది. ఆదోని ఏరియా ఆసుపత్రిలో ప్రథమ అనంరతం కర్నూలుకు తరలించారు. కోలుకోలేక మృతిచెందారు.

వెలవెలబోతున్నాయ్..!



వ్యవసాయ దిగుబడుల సీజన్ ముగిసింది. ఖరీఫ్, రబీ సీజన్ల పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరగడం లేదు. దీంతో వ్యవసాయ మార్కెట్ కమిటీలోని ప్లాట్‌ఫాంలన్నీ పంట ఉత్పత్తులు లేక వెలవెలబోతున్నాయి. వచ్చిన అడపాదడపా పత్తి, వేరుశనగ దిగుబడులు గంటలోపే క్రయ విక్రయాలు ముగుస్తున్నాయి. కూలీలు, హమాలీలు, గుమస్తాలు చెట్ల కింద కాలయాపన చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ పంట ఉత్పత్తులు చేతికొచ్చే మరో మూడునెలల వరకు ఇలాగే ఉంటుందని కూలీలు తెలిపారు. తమకు ప్రత్యామ్నాయంగా ఉపాధి చూపాలని కోరుతున్నారు.

- ఆదోని అగ్రికల్చర్

విద్యుత్ సరఫరాలో మార్పులు

మద్దికెర, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంచర్ల ఫీడర్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు చేసినట్లు విద్యుత్ ఏఈ మహ్మద్ రఫిక్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు జరుగుతున్నందున మార్పులు చేశామని రైతులు సహకరిచాలని కోరారు. నేటి నుంచి ఈనెల 18వ తేదీ వరకు తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు, రాత్రి 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

మార్పులకు అవకాశం

ఆదోని టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మాజీ కౌన్సిలర్, మండిగిరి టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాస్ ఆచారి తెలిపారు. గురువారం మాట్లాడుతూ రేషన్ కార్డు లేనివారు, కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇప్పటికే ఉన్న కార్డులో సభ్యుల పేర్ల తొలగింపు, చేర్పుకు అవకాశం ఉందని, సంబంధిత సచివాలయం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

బకాయిలు చెల్లించాలి

ఆదోని అగ్రికల్చర్ మే 8 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులకు కరువు బకాయిలు చెల్లించాలని ఎస్టీయూ పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ బకాయిలు చెల్లించకుండా ఆదాయపు పన్ను మినహాయించడం దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో జరగడం దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు ఆదాయపు పన్ను చెల్లించినా 60 నెలల కరువు బత్యం బకాయిలు గ్రీన్ చానల్లో ఉన్నాయన్నారు.

కౌలు కార్డులు తప్పనిసరి

తుగ్గలి, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సబ్సిడీ, పథకాలు అందాలంటే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి, ఏవో పవన్ కుమార్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ ఏడాది కౌలుతో సాగు చేసే రైతులు తప్పని సరిగా కౌలు రైతులు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని, గ్రామంలో విచారణ చేసి, కార్డులు అందిస్తామన్నారు. డీటీ నాగరాజు, ఆర్ఐ వెంకట్రాముడు, వీఆర్వోలు నాగేంద్ర, కాశీ రంగస్వామి, కృష్ణారెడ్డిఉన్నారు.

లైంగిక వేధింపుల కేసు నమోదు

ఆదోని రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన మేరకు నిందితుడు అదే గ్రామానికి చెందిన ఓ వివాహితను లైంగికంగా వేధించాడు. వివాహిత భర్త తిరుపతికి వెళ్లడంతో రాత్రి ఆమెను లైంగికంగా వేధించాడు. గురువారం ఉదయం బాధితురాలు పెద్దతుంబళం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెత్తను వేరుచేయాలి

వెల్దుర్తి, మే 8(ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను వేరుచేసి సిబ్బందికి అందించాలని డీఎల్‌పీవో లక్ష్మి సూచించారు. గురువారం పుల్లగుమ్మి గ్రామంలో అవగాహనప కల్పించారు. చెత్తసంపద కేంద్రంలో వర్మీకంపోస్టు తయారుచేసి, రైతులకు విక్రయిస్తామన్నారు. డిప్యూటీ ఎంపీడీవో రవికిశోర్, పంచాయతీ కార్యదర్శి రహమత్‌బాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.



చెట్టుకు అమర్చిన స్విచ్‌బోర్డు, మీటర్

భయం.. భయం

● శభాష్‌పురంలో చెట్టుకు విద్యుత్ స్విచ్‌బోర్డు, మీటర్

తుగ్గలి, మే 8 (ఆంధ్రజ్యోతి): మంబలంలోని శభాష్‌పురంలో సచివాలయ సమీపంలో గ్రామానికి తాగునీరు అందించే మోటారు స్విచ్‌బోర్డు, మీటర్‌ను విద్యుత్ అధికారులు ఓ చింత చెట్టుకు బిగించారు. వర్షం కురిసినా, చెట్టుకు విద్యుత్ సరఫరా జరిగినా ప్రాణాలు పోయే అవకాశం ఉంది. ప్రమాదం చోటు చేసుకోకముందే విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభానికి బిగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజాసేవే లక్ష్యం

ఆదోని టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తానని కౌన్సిలర్ సందీప్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్‌సీపీ మునిసిపల్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సందీప్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. దీంతో గురువారం ఇన్‌చార్జి చైర్మన్ ముల్లా గౌస్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు ఆయనను సన్మానించారు. ఇన్‌చార్జి చైర్మన్ గౌస్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చూడతామని అన్నారు. కార్యక్రమంలో వీసీ నరసింహులు, కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, అశోక్, ఉస్మాన్, మలేకార్ గోవిందురాజులు, గట్టు ఇంతియాజ్, కిషోర్, రామకృష్ణ, చలపతి పాల్గొన్నారు.



సందీప్ రెడ్డిని సన్మానిస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు



ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న పనులు

ఎల్లెల్సీ పనులు ప్రారంభం

హాలహర్వి, మే 8 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ పెండింగ్ ప్యాకేజీ పనులను ప్రారంభించినట్లు తుంగభద్ర బోర్డు డీఈ హసన్‌బాషా గురువారం తెలిపారు. చింతకుంట, బాపురం, హొళగుంద సెక్షన్ల పరిధిలో మిగిలిపోయిన సీసీ లైనింగ్ పనులు చేస్తున్నామని, తొలకరి వర్షాలు వచ్చేలోపు పనులు పూర్తి చేస్తామన్నారు. గట్టు నాణ్యతను పెంచుతామని, ఖరీఫ్‌కు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నీటి పొదుపునకు చర్యలు ప్రారంభించాం

ఆదోని టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పొదుపు చర్యలను ప్రారంభించామని మునిసిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. గురువారం మాట్లాడుతూ బసాపురం చెరువులో 1,690 మిలియన్ లీటర్లు, రాంజల చెరువులో 650మిలియన్ లీటర్లు, మొత్తం 2,340మిలియన్ లీటర్ల నీరు ఉందని, ఇది 80 రోజుల వరకు సరిపోతుందని తెలిపారు. శుభ కార్యక్రమాల కోసం వాటర్ ఫిల్లింగ్ పాయింట్ దగ్గర నీటిని ఇవ్వడం నిలిపివేశామన్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

మద్దికెర, మే 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని హంపా, ఎం.అగ్రహారం, పెరవలి గ్రామాల్లో ఎంఈవో రంగస్వామి, ఉపాధ్యాయులు ప్రచారం చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేదని, ఒక్కో సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకొందన్నారు. ఒకటో తరగతి వరకు ఫౌండేషన్ స్కూల్ ఏర్పాటు చేశారన్నారు.

జగన్ జైలుకు పోవడం ఖాయం

● కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప

ఆదోని, మే 8 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ త్వరలో జైలుకు పోవడం ఖాయమని కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప అన్నారు. గురువారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మానుకోకుంటే భవిష్యత్తులో ఇప్పుడు వచ్చిన 11సీట్లు కూడా రావన్నారు. కుట్టుమిషన్ ద్వారా అవినీతి జరిగిందంటూ జగన్ తన పత్రికలో దుష్ప్రచారాలు చేయడం మానాలన్నారు. ప్రభుత్వం అభివృద్ధి పనులు చేస్తోందని, ఎన్నో కంపెనీలు పెట్టుబడి పెట్టేందుకు రాష్ట్రం వైపు చూస్తున్నారని ఈ ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. సీబీఐ కేసులో గాలి జనార్దన్ రెడ్డి జైలుకు పోయారని త్వరలో జగన్ పోతారన్నారు.



ఇళ్లలోకి మురుగు



పట్టణంలోని మేదరగేరి కాలనీలో ఇళ్లలోకి చేరుతున్న మురుగు

ఆదోని, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేదరగేరి కాలనీలో మురుగు ఇళ్లలోకి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు ముందుకు వెళ్లకుండా ఓవర్ బ్రిడ్జి సమీపంలో పెద్ద బండరాయి అడ్డం వేసినట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మురుగులోనే రాకపోకలు సాగిస్తున్నామని అధికారులు స్పందించి, పారిశుధ్య పనులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోండి


ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

గోనెగండ్ల, మే 8(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ స్కీం కింద మంజూరై సగంలో నిలిచిపోయిన ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అదనపు నిధులను విడుదల చేస్తోంది. ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ చిరంజీవి కోరారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని కేజీబీవీ పాఠశాల దగ్గర ఉన్న హౌసింగ్ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారునికి రూ. 1.80 లక్షలు మంజూరు అయ్యాయని పాత బిల్లుతో పాటు ఆదనంగా బీసీ, ఎస్సీలకు మరో రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 75వేలు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ప్రసాద్, ఎంపీడీవో మణింజరి, హౌసింగ్ ఏఈ షేక్షావలి, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

ఎమ్మిగనూరు టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఇందులో 73మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆనంద్‌రాజ్ మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 153 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు. 13 బహుళజాతి కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా 73మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, వేణు గోపాల్ సీఈవో సెట్కూర్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, మే 8 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. గురువారం శుభదినం కావడంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం, పురవీధులు భక్తులతో కిక్కిరిశాయి.


స్వామి వారికి హారతి ఇస్తున్న పీఠాధిపతి

● నిజ బృందావనాన్ని దర్శించుకున్న భక్తులు

రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకున్నారు. రాఘవేంద్ర స్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని ఏకాదశి కావడంతో నిత్య పూజలకు విరామం కల్పించారు.

శ్రీమఠం అన్నదానానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి విజయవాడకు చెందిన జంగ వెంకట రాఘవేంద్ర అను భక్తుడు రూ.1లక్ష అన్నదానానికి విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషీ, సురేష్ కోనాపూర్ తెలిపారు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


విద్యుత్ దీపాల అలంకరణలో దేవాలయం

గోనెగండ్ల, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరంపల్లి గ్రామంలో గురువారం వీరబ్రహ్మేంద్రస్వామి 29వ తిరునాళ్లను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామోత్సవం, అనంతరం స్వామివారి దంపతుల కల్యాణం, సాయంత్రం రథోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి రథోత్సవం పురవీధుల గుండా సాగింది. వీరబ్రహ్మేంద్రస్వామి నామస్మరణతో వీధులు మార్మోగాయి. రథోత్సవం అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం భజన కార్యక్రమం కొనసాగింది. తిరునాళ్ల సందర్భంగా పరుగుపందెం, బండలాగుడు పోటీలు ఏర్పాటుచేశారు. ఆలయ ధర్మకర్త సంజీవయ్యస్వామి పరుగు పందెంలో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు.

కోసిగిలో.. :

మండలంలోని మూగలదొడ్డి గ్రామంలో ఈ నెల 7వ తేదీ నుంచి మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలతో పాటు రథోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. గురువారం వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవ వేడుకలను గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు అనంతరం గురువారం సాయంత్రం స్వామివారి రథోత్సవం గ్రామస్థుల మధ్య వైభవంగా నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్ని కులాల వారు ఒక చోటకు చేరి సహపంక్తి భోజనాలు చేశారు. గ్రామం అంతా కలిసి పిల్లాపాపలతో అందరూ కలిసి భోజనాలు చేసి వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివలింగమ్మ, టీడీపీ నాయకులు వీరారెడ్డి, శ్రీను, కృష్ణారెడ్డి, చంద్రాస్, శివశంకర్, సోమేష్ తదితరులు ఉన్నారు.

కుండలెన్ని చేసినా కష్టాలే..

● వైసీపీ ప్రభుత్వం ఆదుకున్న దాఖలాలేవు
● దుర్భర స్థితిలో కుమ్మర్ల జీవితాలు

కోసిగి, మే 8 (ఆంధ్రజ్యోతి): కుండలు ఎన్ని చేసినా కుమ్మర్ల కష్టాలు మాత్రం తీరడం లేదు. ప్రభుత్వాలు ఎన్ని మారినా.. తమ జీవితాల్లో మార్పు లేదని, తాతల కాలం నుంచి తామూ, తమ పిల్లలు కూడా అప్పుడు కట్టుకున్న ఇళ్లలోనే జీవితాలు సాగిస్తున్నామని.. నాలుగు తరాలుగా ఒకే ఇంట్లో ఉన్నా ఏ ప్రభుత్వం కూడా తమని ఆదుకోలేదని కోసిగిలోని చేతివృత్తిదారులైన కుమ్మరులు ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రమైన కోసిగిలో సుమారు వంద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరి జనాభా సుమారు 900 దాకా ఉంటుంది. మూడు వందలకు పైగా ఓటు హక్కు కలిగినవారు ఉన్నా.. ఏ ప్రభుత్వాలు తమను ఆదుకోవడం లేదని, మట్టి కుండలు, పాత్రలు చేసి, వాటిని బట్టీల్లో కాల్చి అమ్మడమే తప్ప తమకేం జీవనాధారం లేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని కులాల వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చినా, తమకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలోనైనా తమ బ్రతుకులు మారుతాయని వారు ఆశ పడుతున్నారు. నాటి నుంచి నేటి వరకు కోసిగిలో కుమ్మరులు ఒకే ఇంట్లో నాలుగు తరాల వారు జీవిస్తూ మగ్గుతున్నారు. ఇంటి స్థలాలు ఇవ్వకపోవడంతో ఉన్న ఇంట్లోనే జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కుమ్మరులకు ప్రభుత్వం చేతి వృత్తిదారులకు పనిముట్లు అందించి ఆదుకుందని, ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వం ఇంటి స్థలాలతో పాటు ఇంటి నిర్మాణాలకు సహకరించి, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు. చేతివృత్తినే నమ్ముకున్న కుమ్మరులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇళ్ల వద్దే మట్టిపాత్రలను కాల్చే బట్టీలను ఏర్పాటు చేసుకోవడంతో ఆ పొగతో అనారోగ్యం పాలవుతూ దుర్భరమైన జీవితం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 85 ఏళ్ల వయసులో కూడా కుమ్మరి ఈరన్న అనే వ్యక్తి కుండలు చేస్తూ బతుకీడుస్తున్నాడని, చిన్న పిల్లలను కూడా బడులకు పంపించకుండా తమ ఇంట్లోనే పనులు చేయించుకోవలసి వస్తోందని అందరం కష్టపడి పని చేస్తేనే జీవించగలుగుతామని కుమ్మరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కుండలు చేస్తున్న కుమ్మరులు

● పుట్టినప్పటి నుంచి ఇదే వృతి



మా తాత, నాన్నతో కలిసి నేను కూడా చిన్నప్పటి నుంచి చేతివృత్తిని నమ్ముకుని కుండలు విక్రయిస్తూ జీవిస్తున్నాము. ఎన్ని ప్రభుత్వాలు మారినా మా బతుకులు మారడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మాకు ఇంటి స్థళాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నాము.

- కుమ్మరి సిద్దప్ప, కోసిగి:

● కుండలు చేస్తేనే మాకు బువ్వ

నేటికి కూడా కుండలు చేసి అమ్ముకుంటేనే మాకు నాలుగు మెతుకులు కడుపులోకి పోతాయి. ఈ పని తప్ప మాకు వేరే పనులు చేయడం రాదు. మాకు ఎలాంటి ఆస్తులు, పొలాలు లేవు. చేతి వృత్తినే నమ్ముకున్నాం. మా తాతల కాలం నుంచి మా నాన్న నేను, మా పిల్లలు ఇదే పని చేసుకుంటూ జీవిస్తున్నాము. ఇప్పటికైనా ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.



-కుమ్మరి లచ్చుమయ్య, కోసిగి

బోరు పూడ్చేశారు.!



బోరు పూడ్చడంతో నిరుయోగంగా మారిన ట్యాంకు

ఎమ్మిగనూరు టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : నీరు రావడంలేదని అనుమతి లేకుండా మున్సిపాలిటీకి చెందిన బోరును ఓ వ్యక్తి అకారణంగా తొలగించేశాడు. ఈ సంఘటన పట్టణంలోని సంజీవ నగర్‌లో జరిగింది. కొన్నేళ్ల క్రితం కాలనీవాసుల నీటి అవసరాల కోసం నీటి బోరు, మినీ నీటి ట్యాంక్‌ను ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాలనీవాసుల నీటి అవసరాలకు బోరు వినియోగించుకుంటున్నారు. వారం రోజులుగా బోరులో నీటి ఊట తగ్గుముఖం పట్టింది. దీంతో నీరు రావడం కొంచం కష్టంగా మారింది. ఇదే అదునుగా భావించిన స్థల యజమాని మున్సిపల్ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బోరు పుడ్చేశాడు. తన ఇంటికి అడ్డంగా ఉందని నీరు రావడంలేదని బోరును పూడ్చేయడంతో కాలనీ వాసులు అందోళన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకుని బోరును ఏర్పాటు చేయాలని కోరారు.

కమిషనర్ వివరణ:

ఆ బోరు వేసి చాలా సంవత్సరాలు అయింది. పాత పడిపోవడం వల్ల పూడుకుపోయింది. అప్పట్లో సిబ్బంది ప్రైవేట్ స్థలంలో వేశారు. త్వరలో కొత్త బోరు ఏర్పాటు చేస్తాం.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి

ఎమ్మిగనూరు రూరల్, మే8(ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మునెప్ప పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మిగనూరులోని సీపీఐ కార్యాలయంలో తాలుకా కార్యదర్శి తిమ్మగురుడు అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, 8గంటల పని విధానాన్ని కొనసాగించాలన్నారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాలు కలిసి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. 20 డిమాండ్ల సాధనకు ఈనెల 20వతేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో వీరేష్, యల్లప్ప, నరసింహులు, నాగరాజు, రవి, సోమన్నలు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ


రిజిష్టర్లు తనిఖీ చేస్నున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హేబీఎస్ కాలనీ సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ విధుల్లో భాగంగా సచివాలయాల్లోని పలు రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించి విధుల్లో నిర్లక్ష్యం వహించిన సెక్రెటరీకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రజలకు అందించే సర్వీసుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించి అందుబాటులో ఉండాలని అదేశించారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



తేరును పరిశీలిస్తున్న ఎస్ఐ, టీడీపీ నాయకుడు ముత్తురెడ్డి

కోసిగి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీన కోసిగి ఆరాధ్య దైవమైన కోసిగయ్య స్వామి (ఆంజనేయస్వామి) రథోత్సవ వేడుకలను అందరూ కలిసికట్టుగా ప్రశాంతంగా జరుపుకోవాలని కోసిగి ఎస్ఐ హనుమంతరెడ్డి కోరారు. గురువారం కోసిగిలోని తేరుబజారు మైదానంలో ఉన్న కోసిగయ్య రథోత్సవ ఏర్పాట్ల పనులను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో అతి పెద్ద రథోత్సవంలో ఒకటిగా కోసిగయ్య రథోత్సవ వేడుక జరుగుతుందని, కోసిగి ప్రజలతో పాటు అన్ని గ్రామాల ప్రజలు, ఆయా పార్టీల నాయకులు సహకరించి రథోత్సవ వేడుకల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాతంగా జరుపుకునేందుకు సహకరించాలని కోరారు. తేరుబజారు మైదానంలోని దుకాణాల ముందు ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర షాపులకు సంబంధించిన వస్తువులు రెండు వైపులా ఉంచరాదని రథోత్సవానికి వ్యాపారులు కూడా సహకరించాలన్నారు. ఆలయ ఈవో ఏ.సాయి కుమార్‌తో చర్చించి ఏర్పాట్ల విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో ఆలయ అర్చకులు శ్రీరాములు, నాడిగేని చిన్న తాయన్న, మాణిక్యరాజు, గాలెం వీరేష్, నరసన్న, మాదిరి లక్ష్మినారాయణ, పోతుల నాగరాజు, బాబాయి ఈరేష్, వందగల్లు నరసింహులు, కంపాటి రామాంజనేయులు, పోతుల వీరారెడ్డి, ఉరుకుందు ఉన్నారు.

సబ్‌స్టేషన్‌కు ఆపరేటర్లు కరువు



సూగూరులో ఏర్పాటు చేసిన 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్

మంత్రాలయం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరులో నిర్మించిన 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్లు కరువయ్యారు. ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఇంత వరకు ఆపరేటర్లను నియమించలేదు. రాజకీయ నాయకుల మధ్య పోటీ నెలకొనడంతో ఈ సబ్‌స్టేషన్‌కు ఆపరేటర్ల నియామకానికి గ్రహణం పట్టింది. ఈ సబ్ స్టేషన్ నుంచి చెట్నహల్లి, మాధవరం ఆధాన్ విల్మార్ గెస్టుహౌస్, బూదూరు, సూగూరు, వి.తిమ్మాపురం, రచ్చుమర్రి గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతోంది. మూడు నెలలు పూర్తయినా ఆపరేటర్లు నియామకం లేకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇప్పటికైనా ఆపరేటర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు నివేదికలు ఇచ్చాం

సూగూరు 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు నాలుగు ఆపరేటర్ల పోస్టులు అవసరం ఉందని, ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. ఇంత వరకు నియామకాలు లేకపోవడంతో పక్క మండలం, గ్రామాల నుంచి ఆపరేటర్లను ఒక్కొక్కరిని మూడు నెలలుగా డిప్యుటేషన్‌కు ఇక్కడకి రప్పించి విధులు కొనసాగిస్తున్నాం. త్వరలో అధికారులు ఆపరేటర్లను నియమిస్తే మెరుగైన నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తాం.

- జి.గోవిందు, ట్రాన్స్‌కో ఏఈ, మంత్రాలయం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ విజయభాస్కర్

గోనెగండ్ల, మే 8(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ అన్నారు. పెద్దమరివీడు గ్రామంలో ప్రజలతో వీటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు, అడ్రస్ గోప్యంగా ఉంచుతామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఇటీవల సైబర్ క్రైమ్స్ పెరుగుతున్నాయని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేతల అభివృద్ధి ఎక్కడ: వైసీపీ

● శిలాఫలకాలతో ఇంకెన్నాళ్లు మోసం



ఎమ్మిగనూరు టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : టెక్స్‌టైల్ పార్కు పేరుతో పదేళ్లుగా పెట్టిన శిలాపలకాలే మిగిలాయని అభివృద్ధి ఒక్క అడుగుకూడా ముందుకెళ్లింది లేదని వైసీపీ నాయకులు ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్కుకు ఇది మూడో సారి శంకుస్థాపన చేయడం కానీ ఇప్పటివరకు మట్టిలో ఒక్క గుట్ట కూడా తవ్వలేదన్నారు. మోసం చేస్తే ప్రజలు క్షమించరు అని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, ఖాసింబేగ్, సోమేశ్, రాము, రఘువీర పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

ఎమ్మిగనూరు టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కమిషనర్ కార్యాలయంలో మండల కార్యదర్శి రాముడు, ఎంప్లాయ్ యూనియన్ నాయకులు నాగరాజు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల 17రోజుల సమ్మె సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని కారుణ్య పోస్టులు భర్తీచేస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మాసాలు గడుస్తున్నా రెగ్యులర్ చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని మే 21, 22, 23వ తేదీన కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉండాలని తెలిపారు .అనంతరం కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కే ఇస్మాయిల్, ఖాజా, బడిషావలి, మనీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్లు..


కల్లుదేవకుంట సమీపంలో కోతకు గురైన రోడ్డు

● పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

మంత్రాలయం, మే 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట, మాధవరం రోడ్డు భారీగా కోతకు గురైనా కూడా పట్టించుకునే వారే లేరు. కల్లుదేవకుంట నుంచి సూగూరు మీదుగా స్టీల్ ఫ్యాక్టరీ, మాధవరానికి రాకపోకలు సాగించే రోడ్డు ప్రయాణికులతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. మాధవరం వాగు వద్ద కల్లుదేవకుంట సమీపంలో సూగూరు సమీపంలో దాదాపు 25 శాతం రోడ్డు కోతకు గురైంది. ప్రయాణికులు ఆదమరిస్తే అంతే సంగతి.. అని గ్రామస్థులు వాపోతున్నారు. రోడ్డును బాగు చేయాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్టీల్ ఫ్యాక్టరీ కాలుష్యంపై విచారణ

మంత్రాలయం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం, సూగూరు గ్రామాల మధ్య ఏర్పాటుచేసిన మారుతి ఇస్పాత్ లిమిటెడ్ (స్టీల్ ఫ్యాక్టరీ) కాలుష్యం వల్ల పంటలు, తాగు నీరు కలుషితమవుతున్నాయన్న రైతుల ఫిర్యాదుతో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిషోర్ రెడ్డి, ఏఈ రామకృష్ణ పరిశీలనకు వచ్చారు. మాధవరం స్టీల్ ఫ్యాక్టరీ ముందు ఉన్న పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం సూగూరు ఎస్ఎస్ ట్యాంకులో ఉన్న నీరు ఫ్యాక్టరీ వల్ల వచ్చే కాలుష్యం వల్ల తాగడానికి పనికిరావడం లేదని కల్లుదేవకుంట గ్రామస్థులు తెలిపారు. మాధవరం గ్రామానికి చెందిన టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, రచ్చుమర్రికి చెందిన మజ్జిగ బొజ్జప్ప, నర్సారెడ్డి, లక్ష్మన్నలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామనాయుడుకు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు ఫ్యాక్టరీ ముందు భాగంలో పరిశీలించారు. ఈ పరిశీలనలో మాధవరం గ్రామ రైతులు పైబావి నర్సిరెడ్డి, గజ్జల నర్సిరెడ్డి, నవకోటి నారాయణ, నష్టపోతున్న రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఈఈ కిషోర్ రెడ్డి, ఏఈ రామకృష్ణ